SAMAYAM

www.epapersamayam.com APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 203 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 02 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## జగన్ నొక్కిన బటన్లన్నీ..
# మేమిచ్చే పింఛన్లంతే!


- సంపద సృష్టించి పేదలకు పంచుతాం
- జూన్‌లోపు ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీ
- పేదరికం నిర్మూలనకే పీ4
- బాపట్ల జిల్లా కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీలో సీఎం చంద్రబాబు

2లో



## ఆవిరవుతున్న ఆశలు

- మయన్మార్‌లో 2,719కి చేరిన భూకంప మృతులు



నేపిడా, బ్యాంకాక్: మయన్మార్‌లో భూకంప మృతుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. తాజాగా ఇది 2,719కి చేరింది. వారిలో ఐదేళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారు. రాజధాని నేపిడాలోని ఓ భవంతి కిందినుంచి 91 గంటల తర్వాత ఓ మహిళ (63)ను మంగళవారం సజీవంగా బయటకు తెచ్చారు. చైనా నుంచి వచ్చిన దళాలు సోమవారం ఒక అపార్ట్‌మెంటు నుంచి ఇలాగే నలుగురిని కాపాడాయి. వీరిలో ఒక గర్భిణి, ఐదేళ్ల చిన్నారి కూడా ఉన్నారు. ఘటన జరిగిన 72 గంటల తర్వాత నుంచి బాధితులు ప్రాణాలతో ఉండేందుకు ఆస్కారం బాగా

తరువాయి 2లో



## మార్పు అంటే..
# రైతులకు కన్నీళ్లా?

- ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదు
- ప్రజలకు మనోధైర్యం ఇచ్చేలా పార్టీ రజతోత్సవ సభ
- భారాస నేతలకు అధినేత కేసీఆర్

### దిశానిర్దేశం

**సమయం న్యూస్, హైదరాబాద్:** 'మార్పు రావాలి' అంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రచా రం చేసి ప్రజలను మభ్యపెట్టిందని.. మార్పు అంటే రైతులకు కన్నీళ్లా? అని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం అనుసరి స్తున్న ప్రజావ్యతిరేక


తరువాయి 2లో

## డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో
# కేంద్రీకృత విధానం

- ఇక హైదరాబాద్ నుంచే ఆర్సీ కార్డులు, లైసెన్సుల జారీ
- వారం రోజుల్లో టెండర్ల ప్రక్రియ
- మహారాష్ట్రలో ఇదే పద్ధతి అమలు

2లో





## సమగ్ర ఆర్థిక భాగస్వామ్య
# ఒప్పందం దిశగా భారత్, చిలీ

- సంప్రదింపులను ప్రారంభించిన ఇరు దేశాల అధినేతలు
- ప్రధాని మోదీతో చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ భేటీ

2లో

## అపోహలను
# తొలగించండి

- మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- హెచ్‌సీయూ వివాదంపై మంత్రులతో అత్యవసర భేటీ
- అనంతరం మేధావులు, ప్రొఫెసర్లతో మంత్రుల సమావేశం




2లో

## వచ్చే మార్చికల్లా
# నక్సలిజం నిర్మూలన

- 'ఎక్స్' వేదికగా ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

**సమయం న్యూస్, ఢిల్లీ:** నరేంద్ర మోదీ ప్రభుత్వం నక్సల్స్ రహిత భారతాన్ని సృష్టించే యజ్ఞంలో పురోగమిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం 'ఎక్స్'లో ప్రకటించారు. నక్సలిజం పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి

తరువాయి 2లో






## గత పాలకుల దుష్ప్రచారంతోనే
# భూ వివాదం...


2లో

* ఆ 400 ఎకరాలు ప్రజల ఆస్తి
* హెచ్‌సీయూ నుంచి అంగుళం కూడా తీసుకోవడం లేదు
* ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి

## బర్డ్‌ఫ్లూ వైరస్‌తో
# రెండేళ్ల చిన్నారి మృతి

- పచ్చి కోడి మాంసం తినడంతోనే..
- రాష్ట్రంలో ఇదే మొదటి కేసు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు

2లో



## డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో కేంద్రీకృత విధానం

**సమయం న్యూస్, హైదరాబాద్:** వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు(ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్సుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని వాహనదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత విధానాన్ని మార్చాలని రవాణాశాఖ నిర్ణయించింది. సంయుక్త రవాణా కమిషనర్(జేటీసీ) చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో అధికారుల బృందం ఇటీవల మహారాష్ట్రకు వెళ్లి.. అక్కడ అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేసింది. అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానికి ఆమోదం లభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర తరహాలో కేంద్రీకృత(సెంట్రలైజ్డ్) విధానాన్ని తెలంగాణలో ప్రవేశపెట్టేందుకు రవాణాశాఖ సిద్ధమవుతోంది. వారం, పది రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే వాహనదారులకు త్వరగా కార్డులు అందుతాయని, పారదర్శకత ఉంటుందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

**రోజుకు 9-12 వేల ఆర్సీలు, లైసెన్సులు..**

రాష్ట్రవ్యాప్తంగా 62 ఆర్టీఓ కార్యాలయాలు ఉన్నాయి. ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సులు నిత్యం 9 వేల నుంచి 12 వేల వరకు జారీ అవుతుంటాయి. నాలుగైదు రోజుల్లో వాహనదారులకు అందాల్సిన ఈ ఆర్సీలు, లైసెన్సులు రెండు, మూడు నెలలకు గానీ అందడం లేదు. హైదరాబాద్ పరిధిలో పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీకి చెందిన ఓ మహిళ కారు కొనుగోలు చేసి రూ.1,97,200 లైఫ్‌ట్యాక్స్ చెల్లిస్తే.. ఆర్టీఓ కార్యాలయ అధికారులు మూడు నెలలపాటు ఆర్సీ కార్డు పంపలేదు. అత్తాపూర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి డ్రైవింగ్ లైసెన్స్‌లో తన చిరునామా మార్చుకునేందుకు ఫీజు కడితే రెండు నెలల తర్వాత గానీ కొత్త చిరునామాతో డ్రైవింగ్ లైసెన్సు రాలేదు. ఈ తరహా ఇబ్బందుల్ని లక్షల మంది ఎదుర్కొంటున్నారు. ఏజెంట్ల ద్వారా వెళ్తే పని త్వరగా అయిపోతోందని.. లేకపోతే కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరగాల్సి వస్తోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

## మార్పు అంటే.. రైతులకు కన్నీళ్లా?

(మొదటి పేజీ తరువాయి)

చర్యలతో రైతులు వివిధవర్గాల ప్రజలు మనోధైర్యం కోల్పోతున్నారని పేర్కొన్నారు. భారాస రజతోత్సవ సభ కోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్నారని, వారికి మనోధైర్యం ఇచ్చేవిధంగా సభ ఉండాలని కేసీఆర్ తెలిపారు. సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని, విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లపై చర్చించేందుకు ఆ జిల్లా ముఖ్య నాయకులు మంగళవారం పార్టీ అధినేత కేసీఆర్‌తో ఎర్రవెల్లి నివాసంలో సమావేశమయ్యారు. వారికి దిశానిర్దేశం చేసిన కేసీఆర్.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు 22.5 లక్షల మంది ప్రజలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## బర్డ్‌ఫ్లూ వైరస్‌తో రెండేళ్ల చిన్నారి మృతి

**సమయం న్యూస్, అమరావతి:** బర్డ్‌ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్‌తో పల్నాడు జిల్లా నరసరావుపేటలో రెండేళ్ల చిన్నారి మరణించింది. పచ్చి కోడి మాంసం తినే అలవాటుతో పాటు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం చిన్నారి మరణానికి దారితీసిందని వైద్యులు గుర్తించారు. బర్డ్‌ఫ్లూ కారణంగానే చిన్నారి మరణించినట్లు భారత వైద్య పరిశోధన మండలి కూడా నిర్ధారించి, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. మార్చి 16న బాలిక చనిపోగా, వివిధ స్థాయిల్లో నమూనాలను పరీక్షించి అధికారికంగా ధ్రువీకరించారు. బర్డ్‌ఫ్లూ కారణంగా మనుషుల మరణం సంభవించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. వివిధ దశల్లో పరీక్షలు: నరసరావుపేటకు చెందిన చిన్నారిని జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు కారడం, మూర్ఛ, విరేచనాలు, ఆహారం తినలేని పరిస్థితిలో మార్చి 4న మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు బాలికకు ఆక్సిజన్ సాయంతో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. మార్చి 16న మృతిచెందింది. అయితే, చికిత్స అందించే సమయంలో మార్చి 7న పాప గొంతు, ముక్కు నుంచి తీసిన స్వాబ్ నమూనాలను ఎయిమ్స్‌లోని వీఆర్‌డీఎల్‌లో పరీక్షించారు. ఇన్‌ఫ్లుయెంజా ఎ పాజిటివ్‌గా తేలింది. అనంతరం మరో నమూనాను 15న దిల్లీలో పరీక్షించారు. అక్కడ నివేదిక అనుమానాస్పదంగా రావడంతో అప్రమత్తమైన ఐసీఎంఆర్.. 24న స్వాబ్ నమూనాలను పుణెలోని ఎన్ఐవీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ)కి పంపించింది. అక్కడ హెచ్5ఎన్1 వైరస్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యుల విచారణ: వైద్యారోగ్య శాఖ అధికారులు తాజాగా చిన్నారి కుటుంబ సభ్యులను విచారించారు. పెంపుడు, వీధి కుక్కలతో బాలిక తరచూ ఆడుకునేదని వారు చెప్పారు. చిన్నారిలో ఫిబ్రవరి 28న జ్వర లక్షణాలు కన్పించగా, అంతకు రెండురోజుల ముందు పచ్చి కోడి మాంసం తిన్నట్లు తెలిపారు.

## సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం దిశగా భారత్, చిలీ

**సమయం న్యూస్, దిల్లీ:** రక్షణ, ఆరోగ్యం, వాణిజ్యం, అరుదైన ఖనిజాలు, రైల్వేలు, అంతరిక్షం సహా వివిధ రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని, ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, చిలీ దేశాలు నిర్ణయించాయి. ఇరు దేశాలు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం దిశగా సంప్రదింపులను ప్రారంభిస్తున్నట్లు మంగళవారం ప్రకటించాయి. అయిదు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ మంగళవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. లాటిన్ అమెరికాలో భారత్‌కు చిలీ ఓ ముఖ్యమైన భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయుర్వేదం, సంప్రదాయ మెడిసిన్, వ్యవసాయ ఉత్పత్తుల సహకారంపై ఒప్పందాలు ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. గాబ్రియేల్ మాట్లాడుతూ భారత్ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య బంధాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. సాంస్కృతిక సహకారం అందించుకుంటామన్నారు. 'షూట్ ఇన్ చిలీ' ప్రోగ్రాం ద్వారా భారత చిత్ర పరిశ్రమతో కలిసి పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంటార్కిటికాలో పరిశోధనలకు సహకారం సహా ఇరు దేశాలు నాలుగు కీలక పత్రాలపై సంతకాలు చేశాయి.

**రాష్ట్రపతి భవన్‌లో విందు**

భారతదేశ పర్యటనకు తొలిసారి వచ్చిన చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి విందు ఇచ్చారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముర్ము మాట్లాడుతూ...ఇటీవల కాలంలో పలు భారతీయ కంపెనీలు చిలీలో పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని దేశ అధ్యక్ష పదవిని చేపట్టిన గాబ్రియేల్ జీవిత ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకమని ఆమె చెప్పారు. అంతకుముందు చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. పర్యటనలో భాగంగా ఆయన ఆగ్రా, ముంబయి, బెంగళూరును సందర్శిస్తారని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# అపోహలను తొలగించండి

**సమయం న్యూస్, హైదరాబాద్:** కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై నెలకొన్న అపోహలను తొలగించేలా తక్షణం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ భూవివాదంపై అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. దీనికి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క తదితరులతో పాటు రెవెన్యూ, అటవీ, పరిశ్రమల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. 1975లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి(హెచ్‌సీయూ) జరిపిన భూ కేటాయింపుల నుంచి ఇప్పటివరకూ జరిగిన పూర్తి ప్రక్రియను సీఎంకు, మంత్రులకు అధికారులు వివరించారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదేనని వారు స్పష్టం చేశారు. "1975లో హెచ్‌సీయూకు కంచ గచ్చిబౌలిలో భూమి కేటాయించారు. అయితే భూ యాజమాన్య హక్కులు బదిలీ చేయలేదు. రెవెన్యూ, అటవీ రికార్డుల ప్రకారం.. సర్వే నంబరు 25లోని భూమిని ఎప్పుడూ అటవీ భూమిగా వర్గీకరించలేదు. 2003 ఆగస్టు 9న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఐఎంజీ అకాడమీస్ భారత'తో ఒప్పందం కుదుర్చుకుంది. 2004 ఫిబ్రవరి 3న హెచ్‌సీయూ నుంచి 400 ఎకరాలను ఆ సంస్థకు అప్పగించింది. అందుకు బదులుగా గోపనపల్లిలోని సర్వే నంబర్లు 36, 37లలోని 397 ఎకరాలను హెచ్‌సీయూకు బదలాయించింది. ఐఎంజీ భారతకు భూ కేటాయింపులను 2006 నవంబరు 21న అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. దీనిపై ఐఎంజీ హైకోర్టుకు వెళ్లగా.. ఉన్నత న్యాయస్థానం 2024 మార్చి 7న ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూమి ఎన్నడూ హెచ్‌సీయూలో అంతర్భాగం కాదు. ఎప్పుడూ అటవీ ప్రాంతంగా పరిగణించలేదు. హైకోర్టు తీర్పు అనంతరం టీజీఐఐసీ అభ్యర్థన మేరకు ఆ సంస్థకు ప్రభుత్వం కేటాయించింది. ఇది పూర్తిగా ప్రభుత్వ భూమే. ఇక్కడ భారీ పెట్టుబడులకు అవకాశం కల్పించడం వల్ల సుమారు 5 లక్షల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా" అని ఉన్నతాధికారులు వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రతిపక్ష పార్టీలు విద్యార్థులను రెచ్చగొడుతున్నాయని మంత్రులు ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితులపై సీఎం ఆరా తీశారు.

*** అక్కడ నిర్మాణాలు చేపట్టొద్దు: మేధావులు, ప్రొఫెసర్లు**

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని మంత్రులకు పలువురు మేధావులు, ప్రొఫెసర్లు విన్నవించారు. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు మంగళవారం పలువురు మేధావులు, హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, పర్యావరణవేత్తలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇందులో ప్రొఫెసర్ హరగోపాల్, కిరణ్‌కుమార్ విస్సా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు నితిన్‌కుమార్, శ్యామల్ బిస్వాస్, మాజీ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, పీహెచ్‌డీ గ్రాడ్యుయేట్ డాక్టర్ బీరమ్ రేష్మా, రైతు స్వరాజ్య వేదిక తరపున శ్రీహర్ష తన్నీరు, ఎన్ఏపీఎం అర్బన్ స్ట్రగుల్స్ ఫోరం ప్రతినిధి జాన్ మైఖేల్, పర్యావరణ పరిరక్షణ ప్రతినిధులు అరుణ్ వాసిరెడ్డి, శివానీ ఉపాధ్యాయ, సలహాదారు అంజురావు, మానవ హక్కుల సంఘం ప్రతినిధి బాలరాజు, హెచ్‌సీయూ విద్యార్థి సంఘం తరపున సందీప్, పర్యావరణ సంరక్షణ సమితి ప్రతినిధి రుచిత్ ఆశా కమల్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 3 గంటలకుపైగా ఈ సమావేశం జరిగింది. పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హెచ్‌సీయూ భూమిని లాక్కోవడం లేదని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు. హెచ్‌సీయూ నుంచి ప్రభుత్వం తీసుకున్న భూమికి ప్రత్యామ్నాయంగా అంతే భూమిని అప్పట్లోనే బదలాయించారని, ఇప్పుడు టీజీఐఐసీకి అప్పగించిన భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. వాటికి సంబంధించిన డాక్యుమెం

# జగన్ నొక్కిన బటన్లన్నీ.. మేమిచ్చే పింఛన్లంతే!

**సమయం న్యూస్, ఒంగోలు, బాపట్ల:** 'రాష్ట్రంలో జీతాలకే డబ్బులు లేని పరిస్థితి. గత ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.10 లక్షల కోట్ల అప్పులకు ప్రతినెలా వడ్డీలు కట్టాల్సి వస్తోంది. అయినా పది నెలలుగా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నాం. ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఇస్తున్నాం. రాష్ట్రంలో 1.50 కోట్ల కుటుంబాలుంటే ప్రతి నెలా 64 లక్షలమందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. అంటే సగటున ప్రతి రెండున్నర కుటుంబాలలో ఒకరికి పింఛను ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. 'ఒకప్పుడు బటన్లు నొక్కేవారు.. ఆ బటన్లన్నీ మేమిచ్చే ఒక్క పింఛన్లకే సమానం' అని జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం సీఎం పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని పింఛన్లు అందించారు. ఇద్దరు దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలు ఇచ్చారు. 'రూ.4,000 పింఛను అంటే ఏడాదికి రూ.48 వేలు పంపిణీ చేస్తున్నాం. ఒక ఎకరా భూమిలో సాగు చేస్తే ఎంత వస్తుందో ఆలోచించండి' అని వివరించారు. సంపద సృష్టించి, వచ్చిన ఆదాయాన్ని పేదల కోసం ఖర్చు పెడతామని ముఖ్యమంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యత సాధిస్తామన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో పీ4 కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామంలో ఎంపిక చేసిన పేదలు (బంగారు కుటుంబం), దాతలు (మార్గదర్శులను) పరిచయం చేస్తూ ప్రసంగించారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పార్టీకి అండగా ఉంటున్న పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తేవడానికి ఈ గ్రామానికి వచ్చానని పేర్కొన్నారు. అమరావతిలో తాను ఏసీ రూంలో కూర్చుంటే మంత్రులు క్షేత్రస్థాయికి వెళ్లరనే ఉద్దేశంతోనే ముందుండి నడిపిస్తున్నానని తెలిపారు.

**శభాష్ అధికారులూ..**

వలస వెళ్లిన కూలీలు ప్రతినెలా పింఛను తీసుకోలేరనే ఉద్దేశంతో మూడు నెలలపాటు తీసుకోకున్నా ఒకేసారి ఇస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ప్రతినెలా తొలిరోజే 98 శాతం పింఛన్లు అందిస్తూ అధికారులు పోటీపడి పేదలకు సేవ చేస్తున్నారని అంటూ.. వారి సేవలను 'శభాష్' అంటూ అభినందించారు.

*** సమర్థ పాలనతో అన్నీ బాగవుతాయి**

'అమరావతిలో మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మూడు, నాలుగేళ్లలో అమరావతికి పునర్వైభవం తెస్తాం. రాష్ట్రానికి పోలవరం జీవనాడి. చినగంజాం పక్కనే సముద్రం ఉన్నా నీళ్లులేవు. గోదావరి జలాలు సముద్రం పాలవుతున్నాయి. 2027లోపు పోలవరం పూర్తిచేసి నదుల అనుసంధానం చేస్తాం. దీనివల్ల వ్యవసాయం సజావుగా సాగుతుంది' అని ముఖ్యమంత్రి తెలిపారు. 'విశాఖ ఉక్కు కూడా గాడిలో పడుతోంది. పరిపాలన సమర్థంగా చేస్తే ఏదైనా బాగవుతుంది. ఈ నెలలోనే డీఎస్సీ ప్రకటన ఇచ్చి.. జూన్‌లోపు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తాం. జూన్‌లోపు తల్లికి వందనం అమలు చేస్తాం' అని తెలిపారు. గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. మే, జూన్‌లో సముద్రంలో చేపల వేటను నిషేధిస్తున్నందున మత్స్యకారుల కుటుంబాలకు ఈ నెలలో రూ.20 వేలు ఇస్తామన్నారు.

*** వృత్తిదారుల జీవితాలు బాగుచేస్తా**

'యాదవులు, చేనేతలు, గీత కార్మికులు ఇలా వృత్తిదారులందరి కోసం ఏం చేస్తే వారి జీవితాలు బాగుపడతాయా అని ఆలోచిస్తున్నా. గొర్రెలు, ఆవులను మేపడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఊళ్లోనే మేపుకొనే, గడ్డి పెంచుకునే పరిస్థితులు రానున్నాయి. కొత్తగొల్లపాలెంలో చదువు మానేసిన వారికి ఉపాధి కల్పించడానికి ఇంటి దగ్గర గొర్రెలు మేపుకొంటూ వ్యాపారం చేయడం నేర్పిస్తా' అని ఆయన తెలిపారు. పేదరికాన్ని తొలగించడానికి పీ4 కార్యక్రమం తీసుకొచ్చామన్నారు.

# గత పాలకుల దుష్ప్రచారంతోనే భూ వివాదం

**సమయం న్యూస్, హైదరాబాద్:** "రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై వివాదం వెనుక గత పాలకుల దుష్ప్రచారం ఉంది. ఆ భూమి ప్రజలకు చెందిన రూ.వేల కోట్ల విలువైన ఆస్తి. దానిపై యాజమాన్య హక్కులను సాధించిన ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. వర్సిటీ భూములను ప్రభుత్వం గుంజుకుంటోందని అవాస్తవాలను ప్రచారం చేస్తుండటాన్ని ఖండిస్తున్నాం" అని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, పీసీసీఎఫ్ డోబ్రియాల్ తదితరులతో కలిసి మంగళవారం సచివాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వాస్తవాలేంటో రాష్ట్రానికి, దేశానికి తెలియజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. గత భారాస ప్రభుత్వం భూములపై గట్టిగా కొట్లాడలేదు: భట్టివిక్రమార్క హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూములను ప్రభుత్వం లాక్కుని అమ్ముకునే ప్రయత్నాలు చేస్తోందని కొన్ని పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క విమర్శించారు. "2004లో ఉమ్మడి ఏపీలో అప్పటి తెదేపా ప్రభుత్వం వర్సిటీ నుంచి 400 ఎకరాలు తీసుకుని ఐఎంజీ భారత స్పోర్ట్స్ అనే ప్రైవేటు సంస్థకు ఇచ్చింది. ఆ భూమికి బదులు 397 ఎకరాలను విశ్వవిద్యాలయానికి బదలాయించింది. తీసుకున్న భూమికి బదులు వేరే భూమి ఇస్తున్నట్లు ప్రభుత్వానికి, విశ్వవిద్యాలయ అధికారులకు మధ్య ఒప్పందం, పంచనామా కూడా పూర్తయింది. 400 ఎకరాలు బిల్లీరావు అనే వ్యక్తికి చెందిన సంస్థకు పోయాయి. ఆ తర్వాత 2006లో భూకేటాయింపును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆ సంస్థ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. 2014 నుంచి 2023 వరకు తెలంగాణలో భారాస అధికారంలో ఉన్నా కేసుపై గట్టిగా కొట్లాడకపోగా గాలికి వదిలేసింది. రూ.వేల కోట్ల విలువైన భూమి వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గం గట్టి నిర్ణయం తీసుకుంది. కోర్టులో కొట్లాడి హక్కులు సాధించుకున్నాం. ఈ భూములను అభివృద్ధి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కల్పనకు వినియోగమయ్యేలా ప్రభుత్వం చూస్తుంది తప్ప వేరే ఆలోచన లేదు" అని ఆయన స్పష్టం చేశారు.

*** మష్రూమ్ రాక్స్, పీకాక్ లేక్‌లను కాపాడతాం: శ్రీధర్‌బాబు**

కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలతో సంబంధం ఉన్న సంఘాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. "వారం రోజుల క్రితం హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో సంప్రదింపులు జరిపాం. విశ్వవిద్యాలయానికి చెందిన భూమి ఒక్క ఎకరం కూడా రికార్డుల్లో లేదని, వర్సిటీ భూమి దానికే ఉండాలని స్పష్టం చేశాం. పాలకమండలి సమావేశంలో చర్చించి వస్తే.. భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తామని తెలిపాం. ప్రభుత్వ భూముల్లో ఉన్న రాక్ ఫౌండేషన్, మష్రూమ్ రాక్స్, పీకాక్ లేక్‌లను కాపాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని విద్యార్థులు, వర్సిటీ సందర్శించి.. వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటుంది. ప్రజల ఆస్తులను కాపాడాలని, ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. మేం చేపడుతున్న అభివృద్ధి పనులను ఎలా అడ్డుకోవాలా అని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని భారాస, భాజపాలకు చెందిన మిత్రులను కోరుతున్నాం. యూనివర్సిటీ పరిధిలోని భూములను స్పష్టంగా గుర్తించి హక్కులను జారీ చేయాలని మా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## ఆవిరవుతున్న ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. 4,521 మంది గాయపడగా.. 441 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. మృతుల సంఖ్య పెరుగుతుందని భయపడుతున్నారు. సహాయక బృందాలు భూకంప తాకిడి ప్రాంతాలకు చేరుకోలేకపోతున్నాయి. రహదారులు ధ్వంసమవడం ఒక కారణమైతే.. ప్రభుత్వ, తిరుగుబాటు దళాల మధ్య ఘర్షణలు మరో ప్రధాన అవరోధంగా మారాయి. చాలాచోట్లకు ఆహారం, తాగునీరు, ఔషధాలు చేర్చలేకపోతున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో కుప్పకూలిన ఓ ఆకాశహర్మ్యం శిథిలాల కింద 300 మంది కార్మికులు చిక్కుకుని ఉంటారని, వారిలో ఎక్కువమంది విదేశాల నుంచి వచ్చినవారేనని కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పటివరకూ అక్కడ 13 మృతదేహాలు బయటపడ్డాయి.

## వచ్చే మార్చికల్లా నక్సలిజం నిర్మూలన

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలు చేపడుతూ దేశంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్యను 12 నుంచి 6కి తగ్గించామని పేర్కొన్నారు. 2026 మార్చి 31 కల్లా నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని భారత్ లక్షిస్తోందన్నారు. దేశంలో నక్సలిజం ప్రభావిత జిల్లాలు 38 ఉండగా, వాటిలో 12 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, ఇప్పుడు అవి ఆరుకు తగ్గాయని కేంద్ర హోంశాఖ తెలిపింది. 38 నక్సలిజం ప్రభావిత జిల్లాల్లో ఆందోళనకర జిల్లాలు ఉన్నాయనీ, వాటిలో అల్లూరి సీతారామ రాజు జిల్లా (ఆంధ్రప్రదేశ్), భద్రాద్రికొత్త గూడెం జిల్లా (తెలంగాణ) కూడా ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న గట్టి చర్యల వల్ల తెలంగాణలోని ములుగు జిల్లాలో వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం పట్టిందని వివరించింది. నక్సలిజం వల్ల తీవ్రంగా ప్రభావితమైన జిల్లాల్లో రూ.30 కోట్లతో, ఆందోళనకర జిల్లాల్లో రూ.10 కోట్లతో మౌలిక వసతులను అభివృద్ధి చేశామని, ఈ నిధులను కేంద్రం ప్రత్యేక సహాయంగా అందించిందని హోం శాఖ వెల్లడించింది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల వరుస కాల్పుల్లో పలువురు మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే.



400 ఎకరాల హెచ్ సి యు భూములను అక్రమంగా అమ్మకానికి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాడుతున్న బిజెపి ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టు చేసి కాంచన బాగ్ పిఎస్ కు తరలించడం జరిగింది. ఇందులో అంబర్ పేట డివిజన్ బిజెపి పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎ . యశ్వంత్ ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

*- అంబర్ పేట, సమయం న్యూస్:*

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం

- **సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ కి పాలాభిషేకం చేసిన సన్నబియ్యం లబ్ధిదారులు**

గజ్వేల్, ఏప్రిల్ 1: పేదల సంక్షేమానికి కృషి చేసే కాంగ్రెస్ ప్రభుత్వమే పేదల ప్రభుత్వమని ఆర్ అండ్ ఆర్ కాలనీ సింగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాలి రాములు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మంగళవారం లబ్ధిదారులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎక్కడా లేనివిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500ల గ్యాస్ సబ్సిడీ అమలు చేశారన్నారు. రైతులకు ఎన్నడూ లేని విధంగా రూ. 2 లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. మరోసారి పేదలపై ఉన్న ప్రేమను వెల్లడిస్తూ రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేపట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కిందన్నారు. ప్రజలంతా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలనతో ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, రమేష్, స్వామి, నర్సింహా రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకానికి ఎక్కువమంది
# దరఖాస్తులు చేసుకునేలా యువతను కార్యకర్తలు ప్రోత్సహించాలి

- **మండల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మల్లేశం చారి**



**వెల్దుర్తి ఏప్రిల్ 1, (సమయం న్యూస్):** రాజీవ్ యువ వికాసం పథకానికి మండలం నుండి ఎక్కువమంది దరఖాస్తులు చేసుకునేలా యువతను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రోత్సహించాలి అని వెల్దుర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆవుసుల మల్లేశం చారి ఒక ప్రకటన లో తెలిపారు, ఈ సందర్భంగా తాను మాట్లాడుతు,మండలం ఉన్న యువత రాజీవ్ యువ వికాసానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులైన వారు దరఖాస్తు చేసుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కార్యకర్తలను కోరారు,రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది, మండల అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను కోరారు, సీఎం రేవంత్ రెడ్డి ఆశయం నిరుద్యోగ యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో, రాష్టం లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి పదివేల కోట్లు ఖర్చు చేస్తుందని, అధికారులు అంతా మనసుపెట్టి పనిచేయాలని, దశాబ్ద కాలంగా నిరుద్యోగ యువతపై ఇంత పెద్ద మొత్తంలో ఏ ప్రభుత్వం యువత పై ఎప్పుడూ నిధులు ఖర్చు చేయలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పై మండలం లోని గ్రామాలలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ ఇతర వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి మండలం లో అత్యధిక సంఖ్యలో నిరు ద్యోగ యువకులు దరఖాస్తు చేసుకునేలా మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీ లు, నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు,. కుల ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే రెవెన్యూ అధికారులు కుల ఆదాయ ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్నారు. రూ 50 వేల లోపు రుణం తీసుకున్న వారికి 100% రాయితీ , రూ లక్ష లోపు రుణం తీసుకున్న వారికి 90 శాతం రాయితీ, రెండు లక్షల వరకు రుణం తీసుకున్న వారికి 80% రాయితీ 2 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు రుణం తీసుకున్న వారికి 70% రాయితీ లభిస్తుందని ఈ విషయంపై దరఖాస్తుదారులకు మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సెక్రటరీ లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పథకం లో ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి మాత్రమే వర్తిస్తుంది అన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ పథకం రూ.రెండు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారందరూ అర్హులన్నారు. దరఖాస్తు దారుడు ఈ పథకం కోసం, తమ దగ్గర ఉన్న రేషన్ కార్డు,ఆధార్ కార్డు కుల ఆదాయ ధ్రువపత్రాలతో దరఖాస్తుదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని మండల పరిషత్ కార్యాలయాల లో ఉన్న ప్రజాపాలన కేంద్రాలలో తమ దరఖాస్తుల సంబంధిత పత్రాల కాపీలను అందజేయాలని సూచించారు రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్ ఉన్న కుల ,ఆదాయ ధ్రువపత్రాలను వెంటనే అందజేయాలని కోరారు,ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం గడువును ఏప్రిల్ 14 వరకు పొడిగించిందని తెలిపారు.



# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి

- **సన్నబియ్యంతో పేదల సంతోషం**
- **గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్**

గజ్వేల్, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రజలకు ఉచిత సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా అందిస్తున్న ఉచిత సన్నబియ్యం పంపిణీని మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు రేషన్ దుకాణాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్దార్ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వమని, గతంలో రూ. 5 కిలో బియ్యం ఉన్నదాన్ని 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్ రాజశేఖర్ రెడ్డి రూ. 2 లకు బియ్యం ఇచ్చారని తదుపరి కాంగ్రెస్ హయాంలోనే తలసరి నాలుగు కిలోలు ఉన్న బియ్యాన్ని ఆరు కిలోలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదీనన్నారు. ఇప్పుడు కూడా సన్న బియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలు రేషన్ కార్డు ద్వారా అందిస్తున్న సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ కరుణాకర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ , అజ్గార్ జంగం రమేష్ గౌడ్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, దప్పు గణేష్, సత్యం, అరుణ్ ,శ్రావణ్, ఈదుగాని శివులు, దయ్యాల యాదగిరి, కిష్ట, రెడ్డి, అంజద్ పాల్గొన్నారు.

# సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



**బోధన్ మండలం, 1 ఏప్రిల్, మంగళవారం (సమయం):** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మరో ప్రజాఘట్టం, రాష్ట్రవ్యాప్తంగా 1 ఏప్రిల్ నుండి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ప్రతి చౌకధరల దుకాణాలలో లబ్ధిదారులకు సన్నబియ్యం కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. అందులో భాగంగా బోధన్ మండలం పెంటకుర్దు గ్రామంలోనీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో బోధన్ మండల తహసిల్దార్ విట్టల్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. కాంగ్రెస్ నాయకులచే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు ప్రొద్దుటూరీ సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, అర్హులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్, పాలకమండలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగా శంకర్, నాగేశ్వర రావు, తూము శరత్ రెడ్డి, బోధన్ ఏఎంసీ ఇంచార్జ్ చైర్మన్ చీల శంకర్, తదితర ప్రముఖ నాయకులు, గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



# బీరప్ప కళ్యాణంకు నుడా చైర్మన్ ఆహ్వానించిన బోధన్ కురుమ సంఘం నాయకులు

నిజామాబాద్ పట్టణం, 1 ఏప్రిల్, మంగళవారం (సమయం) : బోధన్ పట్టణంలోని కురుమ సంఘం నాయకులు కురుమ ముద్దుబిడ్డ, నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (NUDA, నూడ) చైర్మన్ కేశ వేణు ను తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ నెలలో బోధన్ పట్టణ కురుమ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే బీరప్ప కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా కోరుతూ, కళ్యాణ మహోత్సవ విషయాలపై చర్చించడం జరిగింది. అలాగే గుడి వద్ద మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా ఏర్పాటు వ్యవస్థ తదితర విషయాలపై చర్చించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు జి.వీరయ్య, సభ్యులు కే. శంకర్, కే.సాయిలు, పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, నితీశ్ కుమార్‌కు రాజాసింగ్ విజ్ఞప్తి

- **వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు తెలపాలని రాజాసింగ్ విజ్ఞప్తి**
- **వక్ఫ్ బోర్డు బిల్లు ప్రవేశపెట్టడానికి దమ్ము ఉండాలన్న రాజాసింగ్**
- **ప్రధాని మోదీ ఒక మంచి నిర్ణయం తీసుకున్నారన్న రాజాసింగ్**



వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు తెలపాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ లకు బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లు ప్రవేశపెట్టడానికి దమ్ము ఉండాలని ఆయన అన్నారు. దేవాలయాలు, రైతులు, పేద ప్రజల భూములను వక్ఫ్ బోర్డు నోటీసు పంపించి కబ్జా చేసిందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డుకు భూములు ఇవ్వాలనే నిర్ణయాన్ని కేంద్రం తెచ్చిన బిల్లు ద్వారా ఆపవచ్చని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక మంచి నిర్ణయం తీసుకున్నారని అన్నారు.

**ముఖ్యమంత్రికి రాజాసింగ్ లేఖ**

శ్రీరామ నవమి సందర్భంగా శోభాయాత్రకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. ఈ నెల 6వ తేదీన ఆకాశ్‌పురి హనుమాన్ దేవాలయం నుంచి సుల్తాన్ బజార్ వరకు ఈ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలి పారు. 2010 నుంచి తన ఆధ్వర్యంలో శోభాయాత్ర జరుగుతోందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ పదిహేనేళ్లలో ఏ సంవత్సరం కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని గుర్తు చేశారు. ఈ శోభాయాత్రలో లక్షలాది మంది రామ భక్తులు భక్తితో పాల్గొంటుంటారని, క్రమశిక్షణతో ఉంటారని తెలిపారు. ఈ శోభాయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరారు.

## సంపాదకీయం

# సంక్షేమం పేరుతో.. దివాళా తీయిస్తే ఎలా!

సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు అమలు చేయమని చెప్పిందెవరు..ఉచిత బియ్యాలు, ఉచిత పందేరాలు... 58 ఏళ్లకే పెన్షన్లు...రాజకీయ నాయకులకు జీతభత్యాలు..ఇవన్నీ ఎవరి కోసం..ప్రజలు కట్టిన పన్నులతో పాటన చేయాల్సిన నేతలు రాష్ట్రాలను దివాళా తీయించేస్తున్నారు. అభివృద్ధి అంటే పెన్షన్లు పంచడం, సన్నబియ్యం పంచడం ఇదేనా..ఇవన్నీ నిలదీయడానికి ప్రజలంతా సిద్ధం కావాలి. ఎపి కావచ్చు.. తెలంగాణ కావచ్చు....ధరల గురించి మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడరు. వారి సెక్యూరిటీ, ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడం...ప్రజల డబ్బుతో సోకులు చేసుకోవడం ఇదా పాలన అంటే..అన్నది ప్రజలంతా ఆలోచించాలి. జగన్ తన హయాంలో రాజధాని, పోలవరం నిర్మాణాలను పక్కన పెట్టారు. విశాఖ భీమిలి దగ్గర మాత్రం అద్భుత సౌధాలను నిర్మించుకున్నారు. దీనికి నాటి పాలకులు నేటికీ సమర్థించు కుంటున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉండదు. ఇలాంటి పాలకులు అవసరమా అని ఆలోచన చేయాలి. రాష్ట్రాలను అప్పుల్లో కూరుకు పోయేలా చేసి...దివాళా తీయించిన నేతలు నీతి వాక్యాలు పలుకుతున్నారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయరు. మిర్చి పండితే కొనుగోలు చేయలేరు. విద్యుత్, వైద్యం, విద్యారంగాలను పటిష్టంట చేయరు. ఇవన్నీ మరచి పందేరాలు చేస్తున్న ...వీరా మన పాలకులు ..అయినందుకు సిగ్గు పడాలి. ఇక తాజాగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని నిస్సిగ్గుగా అమ్మాలనుకోవడం రేవంత్ ప్రభుత్వ దివాళాకోరు విధానం కాక మరోటి కాదు. పెన్షన్లు, ఉచిత బస్సు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఎవరు అడిగారు. ఇవ్వడానికి డబ్బులు ఉన్నాయో లేదో ఆలోచించకుండా ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు భూములు, ఆస్తులు తెగనమ్మితే ఎలా. నీతులు పలుకుతున్న గత బిఆర్ఎస్ పాలకులు కూడా ఇంతకన్నా భిన్నంగా చేయలేదు. వారి హయాంలోనూ భూములు అమ్ముకున్నారు. పేదలు ఇళ్లు కొనగలిగేలా పరిస్థితులు ఉంటే మూసీ మురికిలో ఎందుకు నివసిస్తారు. మూసీ సుందరీకరణ పేరుతో వారిని నిర్వాసితులను చేయడం ఎంతవరకు సమంజసం. మూసీ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సబబు. లగచర్లలో ఫార్మా పేరుతో దాడులు జరిగాయి. అభివృద్ధి పేరుతో గిరిజన తండాలపైకి వెళ్లారు. పాలకులు పక్కా రియల్ ఏజెంట్లలాగా మారితే ఇక రక్షించేదెవరన్నది గుర్తించాలి. చెప్పిన పథకాల అమలుకు, ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ నాయకులు హెచ్‌సియూ భూములను అమ్ముకుంటామంటే ఎలా! హెచ్‌సియూ భూములు అమ్మకాన్ని ఎవ్వరైనా తీవ్రంగా తప్పు పట్టాల్సిందే. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ పరిసర ప్రాంతాలే కాస్త ఆక్సిజన్ ఇచ్చే ప్రాంతాలుగా ఉన్నాయి. వీటిని కూడా లేకుండా చేస్తామనే దుర్మార్గపు ఆలోచన సరికాదు. 400 ఎకరాలు అమ్మి.. రూ.30వేల కోట్లు రాబట్టుకోవాలని అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలి. చ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవడం ద్వారా విలువైన భూములను కాపాడాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం తగదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశంలో పేరు ప్రఖ్యాతలు సాధించుకుంది. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్పగా రాణిస్తున్నారు. దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉంది. హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం భూముల వేలం తగదని ప్రభుత్వం పెద్దలు గుర్తించాలి. భూములు ప్రభుత్వానివే అని చెబుతున్న సిఎం, మంత్రులు వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలి. యూనివర్సిటీ భూములపైన రాజకీయం చేస్తున్న తీరు మంచిది కాదు. బుల్డోజర్లను పెట్టి అక్కడున్న చెట్లను తొలగించి చదును చయడం సరికాదు. హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే. ఇప్పటికే కొండలు, గుట్టలను మాయం చేస్తున్నారు. హైదరాబాద్లో ఇప్పటికే కొండలు గుట్టలు మాయం అయ్యాయి. ఎక్కడపడితే అక్కడ ఇవి ధ్వంసం చేయడం సరికాదు. వీటిని కూడా ఆపాలి. ఇలాచేస్తూ పోతే భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. పర్యావరణ నష్టం ప్రభావంపై అధ్యయనం చేయాలి. ఇప్పటికే హైదరాబాద్‌లో వేల ఎకరాలు మాయం అయ్యాయి. పర్యావరణ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని రేవంత్ ప్రభుత్వానికి రాజకీయపార్టీలు కూడా సూచించాయి. పచ్చదనం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడం సరికాదని పాలకులు గుర్తించాలి. నిధుల సమీకరణ కోసం ఈ తరహా చర్యలు చేపట్టడం కూడా మంచిది కాదు. ముందుగా ఉచిత పథకాలను సమీక్షించాలి. నష్టాలను తెచ్చే పథకాల్లో కోతలు విధించుకోవాలి. అప్పులకు,భేషజాలకు పోకుండా ఉన్న ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడపాలి. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోంచి బయటపడేయాలంటే అమ్మకాలు.. కాదు ఆస్తులు సృష్టించాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయం భూముల అమ్మకం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి. విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్ళడం సరికాదు. ఇప్పటికే హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతోంది. హైదరాబాద్ లో కబ్జాలను గుర్తించి ముందుగా వాటిని విముక్తం చేయాలి. చెరువులు కబ్జాలను గుర్తించాలి. అందుకు హైడ్రా చేస్తున్న కృషిని మరింతగా ప్రోత్సహించాలి. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల కబ్జాలను గుర్తించి, ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి. డబ్బులను వృధా చేసే ఓట్ల పథకాలకు పాతరేసినప్పుడే రాష్ట్రం అప్పుల ఊబినుంచి బయటపడగలదు. ఇది చంద్రబాబుకైనా మరెవ్వరికైనా వర్తిస్తుంది. సంక్షేమం పేరుతో అప్పులు చేసి, పందేరాలు చేయడం ఎంతమాత్రం కాదు. ఫ్రీ పథకాలను ఇకనైనా సమీక్షించడం క్షేమకరం.





# దేశంలోనే సన్నబియ్యం పథకం చారిత్రాత్మకం..

- సీఎం రేవంత్ రెడ్డి
- మహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు..
- పేదలు సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..
- త్వరలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తాం..
- కరీంనగర్లో తాగునీటికి డోకా లేదు..
- సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు..
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కరీంనగర్లో సన్నబియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం..
- పేదలకు సన్నబియ్యం పంపిణీ..



కరీంనగర్ ఏప్రిల్ 01(సమయం న్యూస్): భారతదేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ధనికులు తినే సన్నబియ్యాన్ని పేదలకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే సన్నబియ్యం పంపిణీ పథకం చారిత్రాత్మక మని, ముఖ్యమంత్రి పేదల కోసం మహత్తరమైన పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో దారిద్ర రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా తినదగిన బియ్యం సరఫరా చేస్తామని, ఈ పథకం పేదల గుండెల్లో నిలిచే పథకమని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ లో మంగళవారం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు మంత్రి సన్న బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధనికులు తినే సన్నబియ్యాన్ని పేదలకు తమ ప్రభుత్వం అందిస్తున్నదని, ఈ పథకాన్ని పేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో అర్హులైన పేద ప్రజలందరికీ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం తో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని మంత్రి వెల్లడించారు. కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ షాపుల ద్వారా 2,76,930 రేషన్ కార్డ్ దారులకు, ఎనిమిది లక్షల పదివేల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెల ఒక్కొక్కరికి ఆరు కిలో చొప్పున సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో వానాకాలంలో 72 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యం ఉత్పత్తి అయిందని, దీని ద్వారా 34 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. తమ ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యం పండించేందుకు రైతులకు ఎకరానికి బోనస్ 500 రూపాయల చొప్పున అందిస్తున్నదని తెలిపారు. రైతులకు దాదాపు 36 కోట్ల రూపాయలు సన్న రకం వరి ధాన్యానికి బోనస్ కింద అందించామని చెప్పారు. పదేళ్లు పాలించిన టిఆర్ఎస్ సర్కారు ఇలాంటి ఆలోచన చేయకపోవడం శోచనీయమన్నారు. పేద ప్రజలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కరీంనగర్లో తాగునీటికి ఎలాంటి డోకా లేదని, కొందరు ప్రజలను కన్ఫ్యూజన్ చేసేందుకు తాగునీటి సమస్య ఉందని రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. కరీంనగర్లో జూలై వరకు ఎలాంటి తాగునీటికి ఎలాంటి సమస్య ఉండదని, ఒకవేళ ఎక్కడైనా తలెత్తినా అధికారులు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటారని మంత్రి పేర్కొన్నారు. ఎల్ఎండి రిజర్వాయర్లో ప్రస్తుతం 5.70 టీఎంసీల నీరు ఉందని, జూలై నెల వరకు కరీంనగర్లో తాగునీటి సమస్యకు ఎలాంటి డోకా లేదని తెలిపారు. మిడ్ మానేర్ రిజర్వాయర్లో ప్రస్తుతం 8.78 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. తాగునీటిపరంగా ఎలాంటి ఇబ్బందులు రావని, ఒకవేళ ఎక్కడైనా తలెత్తిన అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటారని మంత్రి భరోసా ఇచ్చారు. సమర్థవంతంగా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. తాగునీటిపై రాజకీయం చేసే వారిని ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సన్న బియ్యం పంపిణీ పథకం విప్లవాత్మకమైం దని ప్రజలంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధనికులు తినే బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనంగా పనిచేస్తుందని తెలిపారు. ఇన్ని రోజులు దొడ్డు బియ్యం అందించిన నేపథ్యంలో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పేదలకు సన్నరకం బియ్యం అందిస్తున్నదని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక రకాలుగా ఆలోచించి ఈ మహత్తరమైన పథకానికి రూపకల్పన చేశారని తెలిపారు. బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకే సన్న రకం బియ్యం పంపిణీని ప్రభుత్వం చేపట్టిం దని పేర్కొన్నారు. పేద ప్రజలంతా సన్నరకం బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి పలు వురూ లబ్ధిదారులకు సన్నారకం బియాన్ని పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ రెవిన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, డీఎస్ఓ నర్సింగరావు, సివిల్ సప్లై డిఎం రజనీకాంత్, అర్బన్ బ్యాంకు అసోసియేటెడ్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఆకుల పద్మ ప్రకాష్‌నేతి కుంట యాదయ్య,నాయకులు మల్లికార్జున రాజేందర్, ఆకార భాస్కర్ రెడ్డి, మాచర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## HCU భూముల ఆక్రమణ నిలిపివేయకుంటే

# మరో తెలంగాణా ఉద్యమం మొదలవుతుంది

: వర్కల శివకిశోర్ గౌడ్



తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపించే విధంగా పరిపాలన విధానం నడుస్తుందని OU TS JAC స్టేట్ కో కన్వీనర్ వర్కల శివకిశోర్ గౌడ్ అన్నారు. హెచ్ సీ యు భూముల ఆక్రమణ నిలిపివేయాలని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యానికి నష్టం చేకూర్చే విధానాలను మానుకోవాలన్నారు. గత వారం రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కార్పొరేట్ అనుకూల విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సర్కారు విద్యార్థుల పట్ల నిరంకుశత్వం వీడి విద్యార్థులతో చర్చించాలని వర్కల శివగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టబడుదారులు ఎలాంటి పెట్టబడులను పెట్టకుండా భయపడే విధంగా రాష్ట్ర పరిపాలన నడుస్తుంది. భవిష్యత్ తరాల కోసం 400 ఎకరాల భూమి అమ్మకుండా HCU యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికే తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరూ మద్దతు తెలుపుతూ ముందుకు కదలాలని అన్నారు. ఏది ఏమైనా కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఇట్లాంటి పరిపాలనను మనమే అడ్డుకోవాలి. ఇది ఇలాగే కొనసాగితే మరో తెలంగాణా ఉద్యమం చావిచుడాల్సి వస్తుంది అని అన్నారు.

# కొండపాక పంపింగ్ స్టేషన్ ను పరిశీలించిన ఎండీ అశోక్ రెడ్డి.

హైదరాబాద్ కి నగరానికి తాగు నీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టులో భాగమైన కొండపాక పంపింగ్ స్టేషన్ ను జలమండలి ఎండి అశోక్ రెడ్డి పరి శీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరానికి నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాడు. పంపింగ్.. మరే విషయాలైనా కూడా అంతరాలు కాకుండా ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముర్మూర్ వద్ద ఇన్ లెట్ నుంచి నగరానికి సరఫరా.. ట్రాన్స్మిషన్ తదితర వివరాలకు సం బంధించిన ఆన్లైన్ మానిటరింగ్ సిస్టమ్ ను వంద శాతం వినియోగం కోసం ప్రణాళికలు రూపొందించి సమర్పించాలని ఆదేశించించారు. అలాగే ఎల్లం పల్లి నుంచి నగరానికి సరఫరా చేసే ప్రతి చుక్కా లెక్కించడానికి ఫ్లో మీటర్ ఏర్పాటు చేసి..ఆ వివరాలు ప్రధాన కార్యాలయంలో పర్యవేక్షించేందుకు మీటరింగ్ వ్యవస్థ కూడా ఆటోమేషన్ చేయమని అధికారులకు సూచించారు. అలాగే ఏదైనా అత్యవసర సమయంలో పంపులు రిపేర్లు గానీ.. కాలిపోయిన సందర్భంగా నీటి



సరఫరా ఆటంకం కాకుండా స్టాండ్ బై మోటార్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే పంపింగ్ స్టేషన్ పరిసరాలలో గార్డెన్, సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్మిషన్ జీఎం రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సన్న బియ్యంతో పేదలకు పౌష్టికాహారం

**జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్**



నిర్మల్ ఏప్రిల్ 01(సమయం న్యూస్): సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లాభం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ రేషన్ దుకాణంలో జిల్లా కలెక్టర్ పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేదకు లాభం చేకూర్చే విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో అత్యధిక విలువ గల పోషకాలు, విటమిన్లు ఉంటాయని, వీటి ద్వారా రక్తహీనత, జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. రేషన్ బియ్యాన్ని ప్రజలు ఎవరు దళారులకు అమ్మవద్దని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ సన్నబియ్యాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ తహసిల్దార్ రాజు, పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రేమ్ నగర్ లో పర్యటించిన కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్

అంబర్ పేట, ఏప్రిల్ 1, సమయం న్యూస్: అంబర్ పెట్ డివిజన్ ప్రేమ్ నగర్ ఓల్డ్ ఏజ్ హోమ్ గల్లీ లో అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తి ప్రజలతో కలిసి ప్రేమనగర్ లో పర్యటించి లోప్రెషర్ తో మంచినీరు సరఫరా అవుతుండడం వల్ల, స్థానిక బస్తీ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, వేసవి కాలం కావున మంచినీరు లో ప్రెషర్ లేకుండా చూడాలని, ప్రజలకు తాగు నీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికా రులు ఏఈ ప్రదీప్, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోష్ చారి, బస్తీ ప్రజలు పార్వతి, సుగుణమ్మ, మంజుల, రజిని, చిట్టి, అశ్విని, పద్మ, ప్రియాంక, శివ, నారాయణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కు స్కోచ్ అవార్డుకు సమన్వయం తో పని చేసిన
# ఆరోగ్య పాఠశాల బృందానికి సన్మానం

* **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, ఏప్రిల్ 01 ( సమయం న్యూస్) :** మన ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్ రాజర్షి షా వైవిధ్య ఆలోచన రూపమైన ఆరోగ్య పాఠశాల ప్రత్యేక కార్యక్రమానికి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి స్కోచ్ అవార్డ్ దక్కింది. ఈ సందర్భంలో ఆనందాన్ని వ్యక్తపరుస్తూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి అవార్డు వచ్చేలా పనిచేసిన డి ఈ ఓ ప్రణీత ఆరోగ్య పాఠశాల జిల్లా సంధాన కర్త అజయ్ జిల్లా వైద్యాధికారి నరేంద్ర రాథోడ్ డాక్టర్ వంశీ డాక్టర్ శ్రీధర్ , అదేవిధంగా మిల్కా జిల్లా సంక్షేమ అధికారి అంతే కాకుండా రిసోర్స్ పర్సన్ గా పనిచేసిన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు శ్రీ పోరెడ్డి అశోక్ ప్రత్యూష సత్యనారాయణ పోచ రెడ్డి సిల్వేరి రాములు వేణు, ప్రతాప్, రాహుల్ రాథోడ్ లకు గౌరవ కలెక్టర్ గారు సన్మానం చేశారు. ఇంతే ఉత్సాహంతో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని 2025 26 విద్యా సంవత్సరంలో జూలై మాసం నుండి డిసెంబర్ వరకు కూడా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు దానికై తగు చర్యలు చేపట్టాల్సిందిగా అందరినీ కోరారు.

## గుండెపోటుతో మరణించిన బిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ప్రీతం దేశాయ్

బోధన్ పట్టణం: 1 ఏప్రిల్, మంగళవారం (సమయం) : ప్రముఖ న్యాయవాది, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్ పుత్రుడు, బోధన్ పట్టణ బిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ప్రీతం దేశాయ్ మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించడం జరిగింది. తన నేత్రాలను లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ కు కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. ప్రీతం దేశాయ్ పార్థివదేహాన్ని పరామర్శకై పట్టణంలోని తమ స్వగృహంలో ఉంచడం జరిగింది. ప్రముఖులు, బంధువులు, శ్రేయోభిలాషులు విచ్చేసి వారి కుటుంబీకులను పరామర్శించారు.



ప్రీతం దేశాయ్ అంత్యక్రియలు బుధవారం తమ పూర్వీకుల స్వగ్రామం రుద్రూర్ లో ఉదయం 10 గంటల 30 నిమిషాలకు నిర్వహించబడతాయని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు.

## ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలలో
# 'రాజీవ్ యువ వికాసం పథకం' దరఖాస్తులు

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

* **నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**



**నిజామాబాద్, ఏప్రిల్ 01 : (సమయం న్యూస్):** నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి పొందేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ ప్రజా పాలన సేవా కేంద్రాలలో నేరుగా దరఖాస్తులు అందించవచ్చని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, ఈబీసీ వర్గాల నిరుద్యోగ యువత ఈ పథకం కింద దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను అన్ని ప్రజా పాలన సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని అన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కుల, ఆదాయ ధృవీకరణ, ఆధార్, పాన్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నెంబర్ ను జత చేసి ప్రజా పాలన సేవా కేంద్రాలలో అందించాలని కలెక్టర్ సూచించారు. ఇదివరకు ఆన్ లైన్లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం ఆఫ్ లైన్ విధానంలోనూ నేరుగా దరఖాస్తులు అందించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని అన్నారు. అన్ని ప్రజాపాలన సేవా కేంద్రాలలో ఖాళీ దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, సరైన విధంగా దరఖాస్తులు చేసుకునేలా సిబ్బంది సహకారం అందిస్తారని అన్నారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత గడువు లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, ఇప్పటికే ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తులు అందించాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన నేపథ్యంలో ఖానాపూర్ మండల కేంద్రంలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, పాల్గొన్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు, తదితరులు.

# సన్నబియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకం

* **రోడ్డు, భవనాలశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.**

నల్గొండ ఏప్రిల్ 01( సమయం న్యూస్): సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని,చరిత్రలో నిలిచిపోయే పథకామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఉగాది రోజున ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పథకం పంపిణీలో భాగంగా మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, జి .ఎడవల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతేకాక గ్రామంలో నాలుగు కోట్ల 63 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు 20 లక్షల మందిని రేషన్ కార్డులలో పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. 3 కోట్ల పది లక్షల మందికి సన్నబియ్యాన్ని ఇవ్వనున్నామని తెలిపారు. 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనున్నామని చెప్పారు. కనగల్ మండలంలో 20 ఏండ్ల కింద ఒక్కొక్కటి లక్ష రూపాయలతో తాను 500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని ,ఇప్పుడు మళ్లీ ఐదు లక్షలతో ఇల్లు కట్టిస్తామని చెప్పారు. ఉచిత బస్సు, రైతు బీమా, రైతు భరోసా, ఎల్పిజి కనెక్షన్ లను తమ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కోసం ఇప్పటివరకు 4000 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.గత ప్రభుత్వం దక్షిణ తెలంగాణను ఎండబెట్టి ఆంధ్రకు నీళ్లు తీసుకెళ్లిందని, ఎస్ఎల్బిసిని పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 4518 కోట్లు బడ్జెట్లో కేటాయించామని ,ఎస్ఎల్బీసీ టన్నెల్ మిషన్ చెడిపోతే అమెరికా నుండి తెప్పించి బాగు చేయించి పనులు మొదలుపెట్టినప్పటికీ దురదృష్టవశాత్తు అటు వైపు నుండి టన్నెల్ కూలిపోవడం వల్ల పనులు ఆగిపోయాయని, సంవత్సరంలోగా టన్నెల్ పూర్తి చేస్తామని తెలిపారు. కనగల్ మండలంలో 80 కోట్ల రూపాయలతో రోడ్ల పనులు చేపట్టడం జరిగిందని, అన్ని గ్రామాలలో డ్రైన్లు, రోడ్లు వేయిస్తున్నామని, ప్రతి గ్రామంలో డ్రైన్లు వేశాకే రోడ్లు వేస్తున్నామని చెప్పారు.జి ఎడవెల్లి చెరువు అలుగు గండి మరమ్మతుకు కోటి 30 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం



నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం అనే మరో అద్భుత పథకం తీసుకువచ్చిందని , ఈ పథకం కింద స్వయం ఉపాధి పొందేందుకు ఏప్రిల్ 14 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని ఒక్కొక్కరికి నాలుగు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉందని, అందువలన నిరుద్యోగ యువతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలను ఇప్పటివరకు భర్తీ చేసిందని ,ఇందిరమ్మ ఇండ్ల కు పేదలను గుర్తించాలని ఆయన కోరారు. కనగల్ ఆసుపత్రిని అభివృద్ధి చేయడం జరిగిందని ,పిల్లల్ని బాగా చదివించాలని ,ఆరోగ్యంగా ఉండాలని, ఏడవల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని ఆయన జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈనెల 7న బక్కతాయికుంట, నర్సింగ్ బట్ల లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకు స్థాపన చేస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డుదారులు, రెసిడెన్షియల్ పాఠశాలలు, పాఠశాల,హాస్టల్ విద్యార్థులు, అందరికీ సన్న బియ్యం పంపిణీ చేసేందుకు రైతులు సన్నధాన్యాన్ని ఎక్కువగా పండించాలని, రాష్ట్రప్రభుత్వం సన్నధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా గ్రేడ్ ఏ ధాన్యాన్ని 2320 రూపాయలు క్వింటాలకు చెల్లించి కొంటున్నదని, అలాగే 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని తెలిపారు. సన్న బియ్యం ఉత్పాదన తక్కువగా ఉన్నప్పటికీ రైతులు సన్న ధాన్యం ఎక్కువగా పండించినప్పుడే సన్న బియ్యం పంపిణీకి అవకాశం ఉంటుందని తెలిపారు. సన్న బియ్యం వల్ల వివిధ రకాల లాభాలు ఉన్నాయని, బ్లడ్ షుగర్ లెవెల్స్ నార్మల్ స్థాయికి తీసుకురావచ్చని, అలాగే సులభంగా జీర్ణం అయ్యేందుకు సన్న బియ్యం ఉపయోగపడతాయని చెప్పారు. అంతకుముందు మంత్రి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అంతేకాక 28 లక్షల రూపాయలతో నిర్మించనున్న మూడు సిసి రోడ్లపనులకు, 3 కోట్ల 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 7 నూతన గ్రామీణ రహదారుల పనులకు, 70 లక్షల రూపాయలతో చేపట్టే ఒక రోడ్డు నిర్వహన పనులకు, మరో 20 లక్షల రూపాయల వ్యయంతో డిఎంఎఫ్టీ కింద చేపట్టనున్న ఒక పనికి శంకుస్థాపన చేశారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, అనూప్ రెడ్డి తదితరులు మాట్లాడారు . నల్గొండ ఆర్డీవోవై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, డిసిఓ పత్యా నాయక్,, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిణి చేసిన మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ

మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ శివపురి కాలనీ లోని రేషన్ షాప్ లో సన్న బియ్యం పెదాలకు పంపిణి చేసారు. ఈ సందర్భంగా పలువురు లబ్ది దారులతో మాట్లాడటం జరిగింది.ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ఈ దేశం లో ఏ ఒక్కరు ఫస్టు పడుకోవద్దని కరోనా సమయం లో సైతం 80 కోట్ల మందికి ఉచితంగా బియ్యం ఇచ్చారని, ఇప్పుడు సైతం సన్న బియ్యనికి కేంద్రం 10 వేల కోట్ల రూపాయల సహకారం అందిస్తునరాని అన్నారు. ఈ కార్యక్రమం లో అనిల్, రాజు, మురళి, నాని, చారీ, సంతోష్, సింహం తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.వెయ్యి కోట్లు దాటిన ఆదాయం

హైదరాబాద్: లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను అధికారులు వెల్లడించారు.

* మున్సిపాలిటీల పరిధిలో మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు: 15.27 లక్షలు
* తిరస్కరణకు గురైన దరఖాస్తులు: 15,894
* ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు: 6.87 లక్షలు
* ఎల్ఆర్ఎస్ ఫీజు పెండింగ్ ఉన్న దరఖాస్తులు: 8.65 లక్షలు
* ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు: 2.6 లక్షలు
* ప్రొసీడింగ్స్ ఇచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు: 58,032

## మే నెల నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు

**మంత్రి నాదెండ్ల మనోహర్**

అమరావతి: మే నెల నుంచి ఏటీఎం కార్డు సైజులో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త రేషన్‌కార్డులో క్యూఆర్ కోడ్, ఇతర భద్రతా ఫీచర్లు ఉంటాయని వెల్లడించారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కుటుంబసభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డులకు ఆప్షన్లు ఇస్తామన్నారు. ఈకేవైసీ పూర్తయితే ఎంతమందికి కార్డులు ఇవ్వాలో స్పష్టత వస్తుందని చెప్పారు. మంగళవారం నుంచే దీపం 2 రెండోవిడత సిలిండర్ బుకింగ్ ప్రారంభమైందన్నారు.



* **వాట్సప్ ద్వారా ధాన్యం విక్రయం**

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలి పారు. నచ్చిన మిల్లుకు తీసుకెళ్లి రైతులు ధాన్యం విక్రయించుకోవచ్చని చెప్పారు. వాట్సప్ ద్వారా కూడా ధాన్యం అమ్ముకునే అవకాశాన్ని కల్పించినట్లు వెల్లడించారు. వాట్సప్ ద్వారా 16వేల మంది రైతులు ధాన్యాన్ని విక్రయించినట్లు తెలిపారు. రైతులకు గన్నీ బ్యాగ్స్ కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

## వల్లభనేని వంశీకి మరోసారి రిమాండ్ పొడిగింపు

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి కోర్టు మరోసారి రిమాండ్ పొడిగించింది. ఆత్కూరు పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసులో ఏప్రిల్ 15 వరకు రిమాండ్ పొడిగిస్తూ గన్నవరం కోర్టు నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఓ భూ వివాదంలో పోలీసులు వంశీపై కేసు నమోదు చేయడం తెలిసిందే. తన భూమిని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారంటూ శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో వంశీని ఇప్పటికే పోలీసులు ఒక రోజు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించారు. వల్లభనేని వంశీ అటు గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసు, టీడీపీ ఆఫీసులో పనిచేసే సత్యవర్ధన్ అనే కంప్యూటర్ ఆపరేటర్ ను కిడ్నాప్ చేసిన బెదిరించిన కేసులోనూ నిందితుడిగా ఉన్నారు.

# మెదక్ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

* **మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లలో రోగు లకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడం, మెరుగైన నిర్వహణకు గుర్తింపుగా నిలుస్తాయి.**



మెదక్ ఏప్రిల్ 01, (సమయం న్యూస్) : మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలు భాగంగా మనోరబాద్ మండలం కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్, మందులు నిల్వచేయు స్టోర్ రూమ్, పరిశీలించారు. ఆయా వార్డుల్లో రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. పలువురు బాలింతలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక పరికరాలు, మౌలిక సదుపాయాలు, వసతులతో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారని.జిల్లాలో వైద్య ప్రమాణాలు మెరుగయ్యాయని చెప్పడానికి మరో నిదర్శనమిదేనని, అన్నారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడం, ఆసుపత్రిలోని అన్ని విభాగాల మెరుగైన నిర్వహణకు ప్రభుత్వ ఆసుపత్రులు తార్కాణాలు గా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైద్యాధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# ప్రతీ నెల 8248 మెట్రిక్ టన్నుల పైచిలుకు సన్న బియ్యం పంపిణీ

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి**
* **అట్టహాసంగా సన్న బియ్యం పంపిణీ ప్రారంభం**





నిజామాబాద్, ఏప్రిల్ 01 : (సమయం న్యూస్) : నిరుపేద కుటుంబాలకు కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన మేరకు జిల్లా వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. జిల్లాలో ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాలలోని 13,10,012 మందికి ప్రతీ నెల 8248.076 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. జిల్లాలో 3,80,222 కుటుంబాలు ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి పరిధిలోని 12,50,996 మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 7505.856 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అంత్యోదయ కార్డులు 20,916 ఉండగా, వాటి పరిధిలోని 57,997 మందికి 732.060 మెట్రిక్ టన్నులు సన్న బియ్యం అందిస్తున్నామని అన్నారు. అన్నపూర్ణ కార్డులు 1016 ఉండగా, 1039 మందికి 10.160 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ప్రతీ నెల పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గల 759 ప్రజా పంపిణీ కేంద్రాల (రేషన్ దుకాణాల) ద్వారా కార్డుదారులందరికీ నిర్దేశిత కోటా మేరకు సన్న బియ్యం పంపిణీ జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

* **అట్టహాసంగా సన్న బియ్యం పంపిణీ ప్రారంభం**

కాగా, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి లాంచనంగా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారు. నిజామాబాద్ నగరంలోని దుబ్బ, కోటగల్లి, అహ్మద్ పురా కాలనీ లలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ లు మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమాలలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సహాయ అధికారి రవి రాథోడ్, స్థానిక అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





# హనుమకొండ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన సిపి

హన్మకొండ ఏప్రిల్01 (సమయం న్యూస్): వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం హనుమకొండ డివిజన్ పరిధిలోని సుబేదారి, హన్మకొండ, కెయూసి పోలీస్ స్టేషన్లతో పాటు హన్మకొండ ట్రాఫిక్, సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్లను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా హన్మకొండ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరి ధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్య క్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని. ట్రై సిటి పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబం ధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట్ హన్మకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి సత్యనారయణ, ఇన్స్‌స్పెక్టర్లు సతీష్, సత్యనారయణ, రవికుమార్, సీతారెడ్డి, సువర్ణతో పాటు స్టేషన్ ఎస్.ఐలు పాల్గోన్నారు.



వేసవిలో దొరికే ముఖ్యమైన పండ్లలో తాటి ముంజలు కూడా ఒకటి. ఇవి చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. తియ్యగా, నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. వీటిని కన్నడలో 'తాటి నుంగు' అని.. తమిళంలో 'నుంగు' అని అంటారు. ఈ పండు శరీరానికి కలిగించే చలువ వల్ల దీన్ని 'ఐస్ యాపిల్' అని కూడా అంటారు. ఎండాకాలం ప్రారంభం కాగానే తాటి ముంజలు మార్కెట్లో మనకు దర్శనమిస్తాయి. మరి శరీరాన్ని చల్లబరిచే ఈ తాటి ముంజల్లో ఉండే పోషకాలు.. ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. అవేంటో తెలుసుకోవాలంటే ఇది చదవాల్సిందే!





# పోషకాల తాటి ముంజలు.. ప్రయోజనాలెన్నో!


**చలువ కోసం..**

ఈ పండులో క్యాలరీలు తక్కువ మొత్తంలో, శరీరానికి కావాల్సిన శక్తి ఎక్కువ మొత్తంలో ఉంటాయి.. కాబట్టి వేసవిలో చలువ కోసం తాటి ముంజల్ని తినడం చాలా అవసరం. కొంతమందికి ఎండాకాలంలో వేడికి ముఖంపై చిన్న చిన్న పొక్కుల్లా వస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొందాలంటే కూడా తాటి ముంజల్ని తినాల్సిందే! డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం..

ఎండాకాలంలో ఎన్ని నీళ్లు తాగినా అది చెమట రూపంలో బయటికి వెళ్లిపోయి డీహైడ్రేట్ అయిపోవడం సర్వసాధారణం. కాబట్టి ముంజల్లో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల వీటిని తింటే ఈ సమస్య నుంచి మనల్ని కాపాడుకోవచ్చు. వేసవిలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, చక్కెరలను ఇవి బ్యాలన్స్ చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి చాలా అవసరం. ఈ పండ్లు లీచీ పండును పోలి ఉంటాయి. రుచి లేత కొబ్బరిలా ఉంటుంది.

**బరువునూ తగ్గిస్తాయి..!**

తాటి ముంజల్లో శరీరానికి కావాల్సిన ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం.. వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండటం వల్ల శరీర బరువును తగ్గించడంలో ఇవి ఎంతగానో తోడ్పడతాయి.



**విషపదార్థాలు మాయం..**

తాటి ముంజలు కాలేయ సంబంధ సమస్యల్ని కూడా తగ్గిస్తాయి. ఈ పండులో అధిక మొత్తంలో ఉండే పొటాషియం శరీరంలో ఉండే విషపదార్థాలను తొలగిస్తుంది.

**గర్భిణులకూ మంచిదే..**

ప్రెగ్నెన్సీ సమయంలో కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాకపోవడం లాంటి సమస్య ఎదురవుతుంది. అలాంటి వారు ముంజల్ని తినాలి. ఫలితంగా జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అంతేకాకుండా.. ఈ సమయంలో ఎదురయ్యే మలబద్ధకం, ఎసిడిటీ.. లాంటి ఆరోగ్య సమస్యల్ని కూడా దూరం చేస్తాయి ఈ పండ్లు. అలాగే శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచి.. శరీరానికి కావాల్సిన మినరల్స్, న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలన్స్ చేయడంలో కూడా ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి.

**అలసట దూరం..**

వేసవిలో అలా కాసేపు బయటికి వెళ్లొస్తేనే అలసిపోతాం కదా! అంతేకాదు.. విపరీతమైన చెమట కూడా పట్టేస్తుంది. ఫలితంగా శరీరం అధిక మొత్తంలో నీటిని కోల్పోతుంది. ఈ క్రమంలో శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించి, అలసట నుంచి ఉపశమనం పొందడానికి ఒక సులువైన మార్గం.. తాటి ముంజల్ని తినడం.

**పొట్టు తీయకుండా తినాలి..**

చాలామంది ముంజల పైన పొట్టు లాగా ఉండే పైపొర తీసేసి తింటారు. కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవి చాలా అవసరం. అలాగే ఈ పొట్టు వల్లే శరీరానికి ఎక్కువ చలువ చేస్తుంది. కాబట్టి తాటి ముంజల్ని పొట్టు తీయకుండా తింటేనే ఆరోగ్యానికి మంచిది.

---

# వేడి తగ్గించే వాటర్ యాపిల్!

యాపిల్ పండు గురించి అందరికీ తెలుసు... కానీ, వాటర్ యాపిల్ గురించి మాత్రం అందరికీ తెలియకపోవచ్చు. దీన్నే షుగర్ యాపిల్, బెల్‌ఫ్రూట్, గులాబ్ జామూన్... వంటి అనేక పేర్లతో పిలుస్తారు. ఈ కాలంలో దొరికే దీన్ని తింటే ఆరోగ్య ప్రయోజనాలెన్నో!



* ఫ్రీరాడికల్స్‌తో పోరాటం... వాటర్ యాపిల్‌లో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ అని పిలిచే ఫినోలిక్ కాంపౌడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ వల్ల దెబ్బతిన్న కణాలకు రక్షణగా నిలుస్తాయి. ఫలితంగా క్యాన్సర్, ఆర్థరైటిస్, గుండె జబ్బులు... వంటివాటి బారిన పడకుండా ఉంటాం. అంతేకాదు, ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలనూ బయటకి పంపిస్తాయి. తెల్ల రక్తకణాల ఉత్పత్తినీ, వ్యాధినిరోధకశక్తినీ పెంచుతాయి.
* డీహైడ్రేషన్ రాకుండా... పేరుకి తగ్గట్లే వాటర్‌యాపిల్‌లో నీటి శాతం ఎక్కువ. ఇది డీహైడ్రేషన్ సమస్యను తగ్గించడమే కాదు... బరువూ తగ్గేలా చేస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణసంబంధిత సమస్యల్ని రానీయదు. డయాబెటిస్‌తో బాధపడేవారి రక్తంలో అధికంగా ఉన్న చక్కెర స్థాయుల్ని తగ్గిస్తుంది.





# MOVIE TIME

## ధనుష్ డైరెక్టర్‌తో రామ్‌చరణ్..?

**టాకీస్:** దక్షిణాది చిత్రపరిశ్రమలో స్టార్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ధనుష్. నటుడిగా, గాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నాడు. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాల్లో నటిస్తున్నాడు. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ హీరోకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అలాగే హిందీలోనూ పలు సినిమాలతో అలరించాడు ధనుష్. తుళ్లువతో ఇలామై సినిమాతో హీరోగా తెరంగేట్రం చేసిన ధనుష్.. ఇప్పటివరకు అనేక హిట్ చిత్రాలతో అడియన్స్ ముందుకు వచ్చాడు. హీరోగానే కాకుండా కంటెంట్ ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన సినిమాలను ఎంచుకుంటూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇన్నాళ్లు తమిళంలో వరుస సినిమాల్లో నటించిన ధనుష్.. ఇటీవలే సార్ సినిమాతో నేరుగా టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇటీవలే జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమాతో దర్శకుడిగా మరో




సక్సెస్ అందుకున్నాడు. తాజాగా మరో సినిమాను రూపొందించేందుకు సిద్ధమైనట్లు టాక్ వినిపిస్తుంది. జాబిలమ్మా నీకు అంత కోపమా సినిమా తర్వాత ధనుష్, అజిత్ హీరోగా ఓ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు వార్తలు వినిపించాయి. అయితే దీని గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. తాజాగా ధనుష్ కొత్త సినిమా గురించి మరో క్రేజీ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ధనుష్ తెరకెక్కించే కొత్త సినిమాలో హీరోగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నట్లు టాక్. ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు రామ్ చరణ్. ఇటీవలే గేమ్ ఛేంజర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చిన చరణ్.. ప్రస్తుతం పెద్ది చిత్రంలో నటిస్తున్నాడు. డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ధనుష్ దర్శకత్వంలో చరణ్ నటించనున్న సినిమాపై క్యూరియాసిటి నెలకొంది. వీరిద్దరి కాంబోలో రాబోయే సినిమా గురించి త్వరలోనే అప్డేట్స్ రానున్నాయట. ప్రస్తుతం ధనుష్ కుబేర, ఇడ్లీ కడై చిత్రాల్లో నటిస్తున్నాడు. అలాగే 'తేరే ఇషాక్ మైన్' అనే హిందీ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో కృతి సనన్ ప్రధాన పాత్రలో నటిస్తుంది.

## అందం, అభినయంతో అదరగొడుతున్న పాయల్‌రాజ్‌పుత్

**టాకీస్:** ఆర్ ఎక్స్ 100 సినిమాతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న చిన్నది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ తన అందచందాలతో ఎప్పుడూ నెట్టింట్లో తెగ ట్రెండ్ అవుతుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షార్ట్ డ్రెస్ లో తన గ్లామర్ తో కుర్రకారుకు చెమటలు పట్టిస్తుంది. డెమిన్ క్లాత్ తో తయారు చేసిన ఈ డ్రెస్ లో బు అమ్మడు చాలా అందంగా ఉంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. అందాల ముద్దుగుమ్మ పాయల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. చేసిన సినిమాలు తక్కువే అయినా ఈ బ్యూటీ యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆర్ ఎక్స్ 100 సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. మరీ ముఖ్యంగా ఈ సినిమాలో పాయల్ తన గ్లామర్ తో కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. పాయల్ రాజ్ పుత్ మొదటి సినిమా మంచి గుర్తింపు తెచ్చినప్పటికీ అంతగా అవకాశాలు రాలేదు. ఆర్ ఎక్స్ 100 సినిమా తర్వాత పాయల్ డిస్కో రాజా, వెంకీ మామా, అనగనగా ఓ అతిథి, పకపా. మాయాపేటిక,మంగళ వారం వంటి సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో మంగళవారం మూవీతో మరోసారి ఈ అమ్మడుకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాలో పాయల్ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ బ్యూటీ ఎప్పుడూ తన వరస ఫొటో షూట్ తో నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ నటి, డెమిన్ క్లాత్ తో తయారు చేసిన సింగిల్ పీస్ షాట్ ధరించి తన అందాలతో మత్తెక్కిస్తుంది. డిఫరెంట్ ఫోజులతో ఉన్న ఈ ఫొటోలు నెటిజన్స్ ను తెగ ఆకట్టుకుంటున్నాయి.




## శ్రీలీలకు నిరాశను కలిగించిన రాబిన్‌హుడ్




టాకీస్: తెలుగులో వరుస హిట్లతో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న యంగ్ హీరోయిన్ శ్రీలీల. బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ టాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్ గా దూసుకుపోయింది ఈ ముద్దుగుమ్మ. ధమాకా సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ సినిమాలో తన ఎనర్జిటిక్ డ్యాన్సులతో అదరగొట్టింది. కానీ ఆ తర్వాత ఈ అమ్మడు ఖాతాలో అదే స్థాయిలో హిట్టు రావడం లేదు. కొన్నాళ్లుగా ఆమె చేస్తున్న ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడుతూనే ఉన్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్?ట్రార్డినరీ మ్యాన్ ఇలా శ్రీలీల నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరుస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన గుంటూరు కారం సినిమాతో ఓ హిట్ పడింది. కానీ ఈ సినిమా శ్రీలీలకు అంతగా క్రేజ్ రాలేదు. ఇక గుంటూరు కారం సినిమా తర్వాత చాలా కాలం గ్యాప్ తీసుకున్న శ్రీలీల.. ఇప్పుడు రాబిన్ హుడ్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఈ సినిమా ఇటీవలే థియేటర్లలో రిలీజ్ రాగా.. మిశ్రమ స్పందన వచ్చింది. ఈ సినిమాతో శ్రీలీలకు మరోసారి నిరాశే ఎదురయ్యింది. నిజానికి ఈ మూవీలో ముందుగా రష్మిక చేయాల్సింది. కానీ డేట్స్ అడ్జస్ట్ కాకపోవడంతో ఆమె స్థానంలోకి శ్రీలీల వచ్చింది. దీంతో ఇప్పుడు ఈ అమ్మడు ఖాతాలో మరో ఫ్లాపు వచ్చి చేరింది.

## మళ్లీ ప్రభాస్‌తో నట్టించనున్న దిశాపటాని

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని నెలలుగా రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు డార్లింగ్. ఇదిలా ఉంటే.. డార్లింగ్ సరసన మరోసారి ఛాన్స్ కొట్టేసింది బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ. ఇప్పటికే ప్రభాస్ తో కలిసి ఓ సినిమాలో నటించి మెప్పించింది దిశా పటానీ. కొన్నాళ్లుగా బాలీవుడ్ ఇండస్ట్రీలో సరైన హిట్టు కోసం ఎదురుచూస్తున్న ఈఅమ్మడుకు.. ఇప్పుడు ప్రభాస్ సరసన వరుస ఆఫర్స్ వస్తున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా దిశా పేరు మారుమోగుతుంది. మోడలింగ్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన దిశా పటానీ.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని హైలెట్ అయ్యింది. ఆ తర్వాత వరుణ్ తేజ్ సరసన లోఫర్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. కానీ ఈ సినిమా ఫ్లాప్ కావడంతో ఆమె బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. హిందీలో వరుస ఆఫర్స్ అందుకుంటూ అక్కడే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. చాలా కాలం తర్వాత ఇటీవల నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి చిత్రంలో ప్రభాస్ జోడిగా కనిపించింది. ఈ మూవీతో పాన్ ఇండియా లెవల్లో మరోసారి పాపులర్ అయ్యింది. ఇక ఇప్పుడు మరోసారి ప్రభాస్ సరసన కనిపించనుందట. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో డార్లింగ్ నటిస్తున్న సినిమాలో ఇమాన్వీ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మరో హీరోయిన్ దిశా పటానీ కనిపించనుందని అంటున్నారు.






## శోభితకు బంపరాఫర్

### తమిళ దర్శకుడి సినిమాలో అవకాశం

**టాకీస్:** అక్కినేని కోడలు, నటి శోభితా ధూళిపాళ్ల బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. పెళ్లికి ముందు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ నాగచైతన్యతో పెళ్లి అనంతరం కొద్దిరోజులు సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మళ్లీ సినీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది ఈ భామ. తమిళ ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఒక సినిమాను తెరకెక్కించబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా శోభితా ధూళిపాళ్లకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. తమిళ అగ్ర దర్శకుడిలలో పా.రంజిత్ ఒక్కడు. అట్టకత్తి మద్రాస్, కబాలి, కాలా, సర్పాట్ట పరంబరై, తంగలాన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ని సంపాదించుకున్నాడు రంజిత్. అయితే తంగలాన్ తర్వాత రంజిత్ వెట్టువం అనే ఒక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో దినేశ్ హీరోగా నటించబోతుండగా.. ఆర్య విలన్ పాత్రలో నటించనున్నాడు.

అట్టకత్తి చిత్రం తరువాత వీరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈ సినిమాలోనే శోభితా ధూళిపాళ్లను హీరోయిన్‌గా తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే శోభితకు ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు.




Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.